ఉచితంగా ఇచ్చినా.. ఉపయోగం సున్నా

ఏ పని చేసినా వివరం ఉండాలి అంటారు పెద్దలు.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం గుడ్డి ఎద్దు చేనులో పడినట్లుగా వ్యవహరిస్తున్నది. ఎప్పుడో ఆగస్టులో పంపిణీ చేయాల్సిన చేపపిల్లలను అక్టోబర్ చివరలో పంపిణీ చేస్తున్నది. రూ.లక్షలను వెచ్చించి చేపపిల్లలను వంద శాతం సబ్సిడీపై మత్స్యకారులకు అందజేస్తున్నది. అయితే రెండునెలలు ఆలస్యం కావడంతో ఆ చేపపిల్లలు పెరిగి పెద్దవయ్యే సరికి వేసవికాలం వచ్చేసి చెరువుల్లో నీరు ఉండకుండాపోయే ప్రమాదం ఉంది. అంతేకాదు ఆగస్టులో మత్స్యకారులు సొంతంగా పోసుకున్న చేపపిల్లలు ఇప్పటికే కొంచెం పెద్దగా పెరిగాయి. ఈక్రమంలో అవి ప్రస్తుతం పోస్తున్న చేపపిల్లలను తినేసే ప్రమాదమూ లేకపోలేదు. దీంతో మత్స్యకారులు సంతోషంగా లేకపోగా ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

–ఇల్లెందు, అక్టోబర్ 23

మత్స్యకారుల అభివృద్ధి కోసం ఉచిత చేపపిల్లల పంపిణీలో భాగంగా ఇల్లెందు, టేకులపల్లి మండలాల్లో చేపల పంపిణీ కార్యక్రమంపై మత్స్యశాఖ సొసైటీ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు మండలాల్లో 93 చెరువులకు సుమారుగా 7లక్షల చేపపిల్లల పంపిణీని సుమారు రూ.3 లక్షల 50వేల వ్యయం చేసి నూరుశాతం రాయితీపై ప్రభుత్వం ఇచ్చింది. అయితే ఆగస్టులో ఇవ్వాల్సిన చేపపిల్లలను రెండు నెలల తర్వాత ఇవ్వడంతో ప్రయోజనం ఉండదని అధికారుల ముందే సొసైటీ సభ్యులు వాపోయారు. బుధవారం జిల్లా మత్స్యశాఖ అధికారి ఇంతియాజ్ అహ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో టేకులపల్లి మండలంలో ఉన్న 31 చెరువులకు 2,43,750 చేపపిల్లలను పంపిణీ చేశారు. వీటి

టేకులపల్లిలో అధికారులతో మాట్లాడుతున్న మత్స్యశాఖ సొసైటీ సభ్యులు

విలువ సుమారు రూ.1లక్షా 23వేలు ఉంటుంది. ఉదయం పది గంటలలోపు పంపిణీ చేయాల్సి ఉండగా వాహనం మధ్యాహ్నం రావడంతో 3గంటలకు పంపిణీ ప్రారంభించారు. మండలం నుంచి 31 చెరువులకు చెందిన మత్స్య సొసైటీ సభ్యులు వచ్చి చేపపిల్లలను చూసి ప్రస్తుతం రెండునెలల ముందు వచ్చి ఉంటే బాగుండేదని ఇవి కొంచెం పెద్ద అయ్యే సరికి చెరువులో నీళ్లు ఎండిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఈ నెల 18వ తేదీన ఇల్లెందు మండల పరిధిలో ఉన్న 62 చెరువులకు 4,73,850 చేపపిల్లలను సుమారుగా 2లక్షల 40వేల రూపాయల వ్యయంతో పంపిణీ చేశారు.

ఆగస్టులో ఇచ్చి ఉంటే బాగుండేది..

నేను బోడు గ్రామ మత్స్యశాఖ సొసైటీ సభ్యుడిని. ప్రభుత్వం ఇప్పుడు ఇస్తున్న చేపపిల్లలు చాలా చిన్నగా ఉన్నాయి. మా మత్స్య సొసైటీ ద్వారా ఇంత కుముందు పోసిన చేపలు పెద్దయ్యాయి. ఈ పిల్లలను అవి తినేసే ప్రమాదం ఉంది. ప్రభుత్వం ఇకనుంచైనా ఆగస్టులో చేపపిల్లల పంపిణీ చేసేలా చొరవ తీసుకోవాలి.

– వాంకుడోత్ వెంకట్రాం, బోడు గ్రామం, టేకులపల్లి

చెరువులు ఎండేసరికి చేపపిల్లలు పెరగవు..

ఈ సంవత్సరం ప్రభుత్వం ఇచ్చిన చేపపిల్లలు పెరిగేసరికి చెరువులు పూర్తిస్థాయిలో ఎండిపోతాయి. వరి పొలాలకు చెరువుల నీరు తీసి వాడుతారు. ఇప్పుడు పోసిన పిల్లలతో మాకు ఎలాంటి లబ్ధి చేకూరదు. ప్రభుత్వం మా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని చేపపిల్లలను త్వరగా పంపించాలని కోరుతున్నాను.

– ఇర్పు సమ్మయ్య, మొరుట్ల రామచంద్రునిపేట

టెండర్ల వల్ల కొంత ఆలస్యమైంది..

ప్రభుత్వం చేపపిల్లల పంపిణీ కోసం రెండు సార్లు టెండర్‌కి పిలువగా ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆలస్యంగా పంపిణీ చేయాల్సి వచ్చింది. చేపపిల్లలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలి.

– ఇంతియాజ్ అహ్మద్‌ఖాన్, జిల్లా మత్స్యశాఖ అధికారి

ఏడుగురు విద్యార్థులకు అస్వస్థత

● పాఠశాలలో మధ్యాహ్న భోజనం తర్వాత వాంతులు ● ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించిన ఉపాధ్యాయులు

మణుగూరు టౌన్, అక్టోబర్ 23 : మధ్యాహ్న భోజనం తిని ఏడుగురు విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం సమితి సింగారం పంచాయతీ పరిధిలోని అరుంధతి నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రోజు మాదిరిగానే విద్యార్థులు పాఠశాలలో మధ్యాహ్నం భోజనం చేశారు. ఆ తర్వాత 4వ తరగతి చదువుతున్న ఐదుగురు, 2వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. దీనిని గమనించిన ఉపాధ్యాయులు శ్రీకాంత్ వారిని వెంటనే మణుగూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వారిని పరీక్షించిన సూపరింటెండెంట్ చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలో నాణ్యమైన ఆహారం వడ్డించకపోవడం వల్లే అస్వస్థతకు గురయ్యారని ఆరోపించారు. దీనిపై ఎంఈవో స్వర్ణజ్యోతిని వివరణ కోరగా.. మధ్యాహ్నం ఆకుకూరతో విద్యార్థులు భోజనం చేశారని తెలిపారు. వాంతులు చేసుకోవడానికి గల కారణాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వివరించారు. కాగా.. చికిత్స అనంతరం విద్యార్థులను డిశ్చార్జి చేసి ఇళ్లకు పంపించారు.

చికిత్స పొందుతున్న చిన్నారులు

సింగరేణిలో నేటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 23 : ఎక్స్‌టర్నల్ ఎంప్లాయిమెంట్ 1/2024 నోటిఫికేషన్ ప్రకారం ఈ ఏడాది జూలై 20, 21 తేదీల్లో సింగరేణి సంస్థలో మొట్టమొదటి సారిగా కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించగా.. 272 మంది అభ్యర్థులు అర్హత సాధించారని, వారి సర్టిఫికెట్లను గురువారం నుంచి పరిశీలించనున్నట్లు జీఎం పర్సనల్ సామ్యూల్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత సాధించిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఈ నెల 18న సింగరేణి వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. గురువారం నుంచి 29వ తేదీ వరకు జరిగే వెరిఫికేషన్‌కు వివిధ డిజిగ్నేషన్లలో అర్హత సాధించిన వారిలో మహిళా రిజర్వేషన్లు కూడా 33 శాతం అమలు చేస్తున్నట్లు జీఎం స్పష్టం చేశారు. జారీ చేసిన పోస్టుల ఆధారంగా మహిళలకు కేటాయించిన సీట్లను ప్రకటించారు.

మిలీషియా సభ్యుల అరెస్టు

పర్ణశాల, అక్టోబర్ 23: దుమ్ముగూడెం ఎస్సై వెంకటప్పయ్య స్పెషల్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ ఈ కోయ్ సిబ్బందితో కలిసి సీతానగరం గ్రామ శివారులో పెద్దబండిరేవు గ్రామానికి వెళ్లే క్రాస్‌రోడ్ వద్ద బుధవారం వాహన తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ఇద్దరు అనుమానాస్పదంగా కనపడడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాకు చెందిన పొడియం కమ్లు అలియాస్ రాజ్‌కుమార్, మడకం సోంబారు నిషేదిత సీపీఐ మావోయిస్టు పార్టీ గంపూర్ ఆర్‌పీసీలో మిలీషియా సభ్యులుగా పనిచేస్తున్నారని తెలిపారు. వారి వద్ద నుంచి 50 మీటర్ల పొడవు కలిగిన కార్డెక్స్ వైర్లను రూ.11,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

స్వాధీనం చేసుకున్న కార్డెక్స్ వైర్లు

ఇవీ ఆయుధాలు.. ఇలా ఉపయోగిస్తాం..!

'ఓపెన్ హౌజ్'లో విద్యార్థులకు వివరించిన పోలీస్ అధికారులు

కొత్తగూడెం క్లైం, అక్టోబర్ 23: పోలీస్ శాఖ వినియోగిస్తున్న ఆయుధాలను, వాటి ఉపయోగాలను విద్యార్థులకు పోలీస్ అధికారులు వివరించారు. ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు పోలీస్ అమరవీరుల సంస్మరణోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో బుధవారం 'ఓపెన్ హౌజ్' లో పోలీసుల ఆయుధాలు, ఇతరత్రా ఉపకరణాలు, ఉపయోగాలను విద్యార్థులకు డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ వివరించారు. ఆయుధాలు, బాంబ్ డిస్పోజల్ సామగ్రి, పోలీస్ జాగిలాలను విద్యార్థులకు ప్రదర్శించారు. కొత్తగూడెం వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ముప్పారపు కరుణాకర్, అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆయుధాల వివరాలను తెలుపుతున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

బీఆర్ఎస్ నాయకుడికి మెచ్చా పరామర్శ

దమ్మపేట రూరల్, అక్టోబర్ 23: మండలంలోని ముష్టిబండకు చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు బండారుపల్లి ప్రసాద్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఇంటి పెద్దను కోల్పోయిన బాధలో ఉన్న ప్రసాద్‌ను. ఆయన కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు బుధవారం పరామర్శించి సంతాపం, సానుభూతి తెలిపారు.

పరామర్శిస్తున్న మెచ్చా నాగేశ్వరరావు

మునగ సాగుకు పూర్తి సబ్సిడీ

అశ్వారావుపేట, అక్టోబర్ 23: ఉపాధి హామీ పథకం కింద మునగ సాగు చేసే చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం పూర్తి సబ్సిడీ ఇస్తుందని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ చెప్పారు. ఆయన బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో మండల పరిషత్ కార్యాలయంలో సమావేశమయ్యారు. మునగ సాగుపై చర్చించారు. మండలవ్యాప్తంగా ప్రభుత్వం ఇచ్చిన 358 ఎకరాల మునగ సాగు లక్ష్యాన్ని పూర్తి చేయాలని చెప్పారు. ఎకరా సాగుకు రూ.1,14,566 ఖర్చవుతుందని, ఈ మొత్తాన్ని సబ్సిడీ రూపంలో ప్రభుత్వం రైతులకు మంజూరు చేస్తుందని వివరించారు. ఆదాయం కూడా ఎకరాకు రూ.లక్ష వరకు వస్తుందని అన్నారు. మునగ సాగు లక్ష్యాన్ని నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండల వ్యవసాయాధికారి శివరామ ప్రసాద్, ఎంపీవో ప్రసాదరావు, ఈజీఎస్ ఏపీవో రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం

భద్రాచలం, అక్టోబర్ 23: భద్రాచలం సీతారామచంద్ర స్వామి ఆలయంలో సీతారాముల నిత్యకల్యాణాన్ని అర్చకులు బుధవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలి హరణం తదితర పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

దరఖాస్తుల ఆహ్వానం

బూర్గంపహాడ్, అక్టోబర్ 23: ఆగస్టు 2024 సెషన్ కోసం ఎన్‌సీవీటీ ప్యాటర్న్ కింద వివిధ ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ ట్రేడ్లలో శిక్షణ పొందడానికి ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మిగిలిన సీట్ల కోసం వాక్‌ఇన్ అడ్మిషన్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నట్లు కృష్ణసాగర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ధర్మాచారి బుధవారం తెలిపారు. వెబ్‌సైట్‌లో ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని, 7వ దఫా వాక్‌ఇన్ అడ్మిషన్లకు అక్టోబర్ 19 నుంచి 30వ తేదీ సాయంత్రం 3 గంటల్లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఆదివాసీ హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

ఆళ్ళపల్లి, అక్టోబర్ 23: యువత ఆదివాసీ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని మాజీ ఎంపీపీ కోండ్రు మంజుభార్గవి, మాజీ జడ్పీటీసీ కొమరం హనుమంతరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా కుమ్రం భీమ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

గుణాత్మక విద్యను పెంపొందించుకోవాలి

భద్రాచలం, అక్టోబర్ 23: విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడానికి ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని ఎంఈవో తోటమళ్ల రమ అన్నారు. బుధవారం పట్టణంలోని జగదీష్‌కాలనీ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్ఏ–1 పరీక్షల తీరును గమనించారు. హెచ్ఎం రాజా శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి ఆర్థిక సాయం

భద్రాచలం, అక్టోబర్ 23: ఇటీవల హైదరాబాద్‌లో తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో అండర్–16 విభాగంలో భద్రాచలానికి చెందిన ఎస్‌కే.అమ్రీన్ జావెలిన్ త్రోలో ప్రథమస్థానంలో నిలిచింది. త్వరలో ఒరిస్సాలో జరిగే జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం కూడా దక్కనున్నది. నిరుపేద కుటుంబానికి చెందిన అమ్రీన్ తండ్రి మస్తాన్‌వలీ ఆటోడ్రైవర్ కావడంతో ఈ విషయాన్ని భద్రాచలం రోటరీక్లబ్ ఉపాధ్యక్షుడు ఎస్‌కె.అజీమ్ కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా పాకాల దంపతులు క్రీడాకారిణికి రూ.5వేలు అందజేసి క్రీడాకారిణిని అభినందించారు.

పోడు రైతులకు హక్కులు కల్పించాలి

బూర్గంపహాడ్, అక్టోబర్ 23: బూర్గంపహాడ్ మండలంలో పోడు రైతులకు హక్కులు కల్పించాలని జిల్లా కాంగ్రెస్ నాయకుడు చల్లా వెంకటనారాయణ ఆధ్వర్యంలో పోడు రైతులు బుధవారం రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్యను భద్రాచలంలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో చక్రవర్తి, బూర్గంపహాడ్ పోడు రైతులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

సీసీ రోడ్ల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాయం

బూర్గంపహాడ్, అక్టోబర్ 23: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల పరిధిలోని నకిరిపేట, టేకులచెరువు, లక్ష్మీపురం గ్రామాల్లో రూ.20.5 లక్షలతో నిర్మించిన నాలుగు సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు ముజాహిద్, జమలారెడ్డి, వెంకటేశ్వరరావు, దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

యలమందరెడ్డికి పరామర్శ

బూర్గంపహాడ్, అక్టోబర్ 23: మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన కైపు యలమందరెడ్డి కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నివాసానికి వెళ్లి యలమందరెడ్డిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జగదీశ్వరరావు తదితరులు ఉన్నారు.

భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

దుమ్ముగూడెం, అక్టోబర్ 23: సీతమ్మసాగర్ భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలని పినపాక కాంగ్రెస్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి ఆధ్వర్యంలో దుమ్ముగూడెం, చర్ల, అశ్వాపురం, మణుగూరు మండలాల రైతులు భద్రాచలం ఆర్డీవో దామోదరరావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో కొమరం దామోదరరావు, సాగి రామచందర్‌రాజు, తెల్లం లక్ష్మీనారాయణ, కారం సమ్మయ్య, రైతులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

మణుగూరు టౌన్, అక్టోబర్ 23: మణుగూరు మండలం కమలాపురంలో ఏఎన్ఎం, ఆశా వర్కర్లతో కలిసి ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ప్రజలు ఎయిడ్స్ బారిన పడకుండా ఎటువంటి జాగ్రత్తలు పాటించాలో తెలిపారు. ఎయిడ్స్‌కి భయపడకుండా దానిపై అవగాహన పెంచుకొని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఓఆర్‌డబ్ల్యూలు రజిని, నాగభూషణం, జయమ్మ పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

మణుగూరు టౌన్, అక్టోబర్ 23: శనివారం అర్ధరాతి వరదల కారణంగా శాంతినగర్, పగిడేరు అంతర్గత రోడ్లు ధ్వంసమయ్యాయని కుంజా రాజు అన్నారు. బుధవారం శాంతినగర్, పగిడేరు యువకులు పంచాయతీ కార్యదర్శి మణికిరణ్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాజా, శ్రావణ్, ఆనంద్, స్రవంతి, శరం నరేష్, బేతమల్ల సుందర్, బక్కయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని రోడ్డెక్కిన గ్రామస్తులు

టేకులపల్లి, అక్టోబర్ 23: రోడ్డు నిర్మించకపోవడాన్ని నిరసిస్తూ ఆ గ్రామస్తులు బుధవారం రోడ్డుపైకి చేరి నిరసన తెలిపారు. మండలంలోని చంద్రుతండా పంచాయతీలోగల రాజుతండా–గోప్యతండా గ్రామాల మధ్యన బీటీ రోడ్డు రెండేళ్ల క్రితం మంజూరైంది. కాంట్రాక్ట్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు. గుంతలమయంగా మారిన ఈ రోడ్డుపై వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రోడ్డు నిర్మించకపోవడాన్ని నిరసిస్తూ గ్రామస్తులు బుధవారం ఇదే రోడ్డుపై కాసేపు నిలబడ్డారు. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

రోడ్డుపై నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

రోడ్డుపై వ్యాపారం నిర్వహిస్తే చర్యలు

టేకులపల్లి, అక్టోబర్ 23: స్థానిక బోడు రోడ్డు సెంటర్‌లో ట్రాఫిక్ ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. కొందరు వ్యాపారులు ఇదే రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారుతున్నది. దీనిపై ఎంపీడీవో రవీందర్‌రావు స్పందించారు. ఎంపీవో గణేష్ గాంధీ, పంచాయతీ కార్యదర్శితో కలిసి బోడు రోడ్డు సెంటర్‌లోని టీ, బేకరీ, ఫ్రూట్స్, కూరగాయల దుకాణాలను పరిశీలించారు. వీటి నిర్వాహకులు తమ దుకాణాల ముందున్న ఆర్‌అండ్‌బీ రోడ్డుపై మార్కింగ్‌ను దాటి, డ్రైనేజీని ఆక్రమించడాన్ని గమనించారు. ఈ ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చారు. గడువులోగా ఆక్రమణలను తొలగించకపోతే, రోడ్డుపై వ్యాపారాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

చండ్రుగొండ, అక్టోబర్ 23: సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని ఎస్సై జి.స్వప్న అన్నారు. స్థానిక సెయింట్ జోసఫ్స్ స్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలు తదితరాంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకుని, తమ తల్లిదండ్రులను.. కుటుంబ సభ్యులను అప్రమత్తం చేయాలని కోరారు. అపరిచితులు ఫోన్ చేసి ఓటీపీ, ఫోన్, ఆధార్ నంబర్, బ్యాంక్ అకౌంట్ వివరాలు అడిగితే చెప్పవద్దని అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ లత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు పాల్వంచ విద్యార్థులు

పాల్వంచ, అక్టోబర్ 23: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టును ఆదివారం ఖమ్మం పటేల్ స్టేడియంలో నిర్వాహకులు ఎంపిక చేశారు. ఇందులో కొందరు పాల్వంచ విద్యార్థులు ఉన్నారు. అండర్–17 బాలుర జట్టుకు ఎస్‌కె.ఖాదర్, హర్షవర్ధన్, అండర్–17 బాలికల జట్టుకు ఓం కారుణ్య, సిహెచ్.చందనశ్రీ, జి.రమ్మీశ్రీ, అండర్–14 బాలుర జట్టుకు తమన్, అండర్–14 బాలికల జట్టుకు ఉపేక్ష, ఎండి.ఆఫ్రీన్, రమ్యశ్రీ ఎంపికయ్యారు. వీరిని కోచ్‌లు శ్రీనివాస్, రాకేష్, మునీర్, సురేష్ అభినందించారు.

బాధిత కుటుంబానికి చేయూత

పర్ణశాల, అక్టోబర్ 23: మండలంలోని పర్ణశాల పంచాయతీ ముసలిమడుగు గ్రామంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. ఈ ఘటనలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి రెడ్ క్రాస్ సొసైటీ అండగా నిలిచింది. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ చేతుల మీదుగా బుధవారం బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో వెంకటరెడ్డి, తెల్లం నరేష్, వాగే ఖాదర్‌బాబు, కృష్ణమూర్తి, రాజేశ్వరి, గజేందర్, విజయ్ పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీ తప్పనిసరి

ఇల్లెందు, అక్టోబర్ 23: దీపావళి బాణాసంచా దుకాణాలలో ఫైర్ సేఫ్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను అన్నారు. ఇల్లెందు, టేకులపల్లి ప్రాంతాల్లోని బాణాసంచా దుకాణాదారులతో ఆయన బుధవారం ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో సమావేశమయ్యారు. డీఎస్పీ మాట్లాడుతూ.. బాణాసంచా దుకాణాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణ, టేకులపల్లి సీఐ సురేష్, ఎస్సైలు సూర్య, సురేష్ పాల్గొన్నారు.

రోడ్డుకు శంకుస్థాపన

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 23: మండలంలో మామిడిగూడెం పంచాయతీలో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఎమ్మెల్యే కోరం కనకయ్య బుధవారం శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో ధన్‌సింగ్, ఎంపీవో చిరంజీవి, పంచాయతీరాజ్ డీఈ రామ్‌కిషన్, ఏఈ రాజు, ఏపీఎం దుర్గారావు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ల వేతనాలు పెంచాలి

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 23: లారీ డ్రైవర్ల వేతనాలను పెంచాలని ఇఫ్టూ అనుబంధ మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోడేటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆయన బుధవారం లారీ డ్రైవర్ల ఆందోళనలో పాల్గొన్నారు. ఇల్లెందు నుంచి వివిధ ప్రాంతాలకు బొగ్గు, ధాన్యం, మొక్కజొన్న సరుకులు రవాణా చేస్తున్న లైసెన్స్‌డ్ లారీ డ్రైవర్లు, క్లీనర్ల వేతనాలు పెంచాలని ఇచ్చిన డిమాండ్ నోటీసుకు యజమానులు స్పందించలేదని విమర్శించారు. తాము సమ్మెలోకి వెళ్తామని స్పష్టం చేశారు. నాయకులు డి.నూనేశ్వర్‌రావు, ఎన్నం నర్సయ్య, సమ్మయ్య, రేసు కృష్ణ, జగన్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

పాల్వంచ, అక్టోబర్ 23: పాల్వంచ గాంధీనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ షేక్ యాకూబ్ పాషా (28) అనే యువకుడు బుధవారం రాత్రి అనుమానాస్పద స్థిలో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. యాకూబ్ పాషా ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఇంటిలో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి కోసం ఆరా తీస్తుండగా మున్సిపాలిటీ పరిధిలోని కరకవాగు వద్ద కేటీపీఎస్‌కు బొగ్గు సరఫరా జరిగే రైలు పట్టాల మీద పడి మృతిచెంది ఉన్నాడు. ఎవరో వ్యక్తులు చంపి పడవేసి ఉంటారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి రజాక్ పాల్వంచ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

KLR COLLEGE OF ENGINEERING & TECHNOLOGY
(Approved by AICTE, New Delhi, Affiliated to JNTUH, Recognised by Govt. of Telangana & Accredited by NBA)
BCM ROAD, PALONCHA – 507115 , BHADRADRI KOTHAGUDEM (DIST).
Phone:8096951481 / 9490756760, E. Mail: klrcetprincipal@gmail.com Website: www.cet.klr.ac.in
Advt. No. KLRT/07/2024 TG-PGECET Code: KLRT1
SPOT ADMISSIONS into M.Tech for the Academic Year 2024 – 2025 on 31.10.2024
Seats are available in **Structural Engineering, Computer Science & Engineering, Microwave & Radar Engineering, Electrical Power Systems** Branches. Interested eligible candidates who have not taken admission anywhere so far can attend for Spot Admissions with the all original certificates along with 3 sets of Xerox copies, 3 passport size photographs and prescribed fee in the college office. Admissions will be made strictly as per the guidelines issued by the Convenor **TGPGECET–2024.**
PRINCIPAL

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స